# కౌటిల్యుని అర్థశాస్త్రం - శాసన స్వరూపం

ఆచార్య.జి.అరుణకుమారి.

చరిత్ర నిర్మాణానికి శాసనాలు అతి ముఖ్యమైన ఆధారాలు. శాసు అనుశిష్టౌ శాసు అనే అదాది ధాతువుకి ల్యుడంత రూపం శాసనం. అనుశాసనం, ఆజ్ఞ అని ఈ పదానికి అర్థాలున్నాయి.

కౌటిల్యుడు అర్థశాస్త్రంలో పత్రం మీద విషయం పెట్టినప్పుడు దానిని శాసనం అంటారని 'శాసనే శాసనమిత్యాచక్షతే' అని అన్నాడు. రాజులకు శాసనం ప్రధానమైనది. ఎందుకంటే సంధి, విగ్రహం రెండూ దాని మీదనే ఆధారపడి ఉంటాయి కాబట్టి.

'శాసన ప్రధానా హి రాజాన: తన్మూలత్వాత్ సంధి విగ్రహయో:'

కౌటిల్యుడు అర్థశాస్త్రంలో శాసనాలు ఎనిమిది విధాలని వాటిని రాయించే విధానాన్ని గురించి శాసనాధికార: అనే 10వ అధ్యాయంలో పేర్కొన్నాడు.

> 'ప్రజ్ఞాపనాజ్ఞా పరిదాన లేఖాస్తథా పరీహార నిసృష్టి లేఖా,
> ప్రావృత్తికశ్చ ప్రతిలేఖ ఏవ సర్వత్రగశ్చేతి హి శాసనాని'.

ప్రజ్ఞాపన లేఖ, ఆజ్ఞాలేఖ, పరిదాన లేఖ, పరీహార లేఖ, నిసృష్టి లేఖ, ప్రావృత్తిక లేఖ, ప్రతిలేఖ, సర్వత్రగలేఖ అని శాసనాలు ఎనిమిది విధాలు. ఆనాడు శాసనానికి లేఖ అనే శబ్దం పర్యాయంగా వాడుకలో ఉంది. స్థిరస్థాయిని పొందిన లేఖలే శాసనాలు.

1. రాజు సాధించిన గొప్ప పనిని గురించి ఇతరులు చెప్పటాన్నే ప్రజ్ఞాపన లేఖ అని అంటారు. దీని వలన రాజుల వంశ చరిత్ర, పరిపాలనా కాలం, యుద్ధ చరిత్ర మొదలైన వివరాలను గ్రహించవచ్చు. ఉదాహరణకు విక్రమేంద్ర భట్టారక వర్మ వేయించిన ఇంద్రపాలనగర శాసనం.

   క్రీ.శ.575 - 600 కాలంనాటి ఎర్రగుడిపాడు శాసనం
2. రాజభృత్యుల నిగ్రహ,అనుగ్రహాలకు సంబంధించిన ప్రభువాజ్ఞను తెలిపే లేఖ ఆజ్ఞాలేఖ.

3. కష్ట సమయాల్లోగాని,రాజు అనుగ్రహం చూపించినప్పుడు గాని ఉత్తమ, మధ్యమ, అథముల అర్హతలను బట్టి ఇచ్చే గౌరవాన్ని తెలియజేసే లేఖ పరీదాన లేఖ. ఎఱకసాని పిల్లలమర్రి శాసనంలో విద్యార్థుల భోజన వసతికి చలివేంద్రంలో నీరు పోసేవారికి, సత్రానికి, వంట వారికిచ్చిన భూదానం దీనికి ఉదాహరణ.

4. కొన్ని జాతులకు సంబంధించి, కొన్ని పురాలకు, గ్రామాలకు, దేశాలకు సంబంధించి రాజాజ్ఞ ప్రకారం పన్నుల రద్దును తెలిపే లేఖ పరీహార లేఖ. ఉదాహరణకు లుంబినీలో బుద్ధుడు జన్మించినందుకు గాను ఆ పురవాసులందరికీ పన్ను మినవహాయింపును క్రీ.పూ. 3వ శతాబ్దంలో అశోకుడు (పడేరియా రుమ్మిన్‌డెయ్) శిలాస్థంభశాసనంలో ప్రకటించాడు.

5. పనులు చేయించే విషయంలోను, కొన్ని ఆజ్ఞలు ఇవ్వటానికిగాని మరొకరికి అధికారాన్నిస్తూ రాసే లేఖ వాచిక లేఖ లేదా నైసృష్టిక లేఖ.

6. ఒక శాసనానికి సంబంధించిన ప్రవృత్తి రెండు విధాలుగా ఉంటుంది. దైవాను గ్రహం వలన కలిగేది మొదటి ప్రవృత్తి. (అకాల వర్షాలు, పంటలు, వర్షాభావాదులు). మానవుల వలన కలిగేది రెండవ ప్రవృత్తి. ఇది జరిగిన యదార్ధ విషయాలకు సంబంధించిది. ఈ రెండు రకాల ప్రవృత్తులను తెలిపేది ప్రావృత్తిక లేఖ ఉదాహరణకు నాగులపాడు శాసనం. తల్లిదండ్రులకు పుణ్యం కలగాలని మూసేటి కాలువ కింద నాలుగు మఱుతుర్ల వృత్తిని నిలుపు సందర్భంలో వేయించిన శాసనం. ఇది రెండవ ప్రవృత్తికి సంబందించినది. రాజులకు పుణ్యం కలగాలని అంగరక్షకుడు వృత్తులను పెట్టిన విషయాన్ని తాడువాయి శాసనం వివరిస్తుంది.

7. ఇతరుల నుండి వచ్చిన లేఖను రాజు సమక్షంలో చదివి దానికి ప్రతిగా రాజు చెప్పే విషయాలను రాయటం ప్రతిలేఖ.
ఈ ప్రతిలేఖలను సర్వసాధారణంగా నాటకాలలో గమనించవచ్చు ఉదాహరణకు మాళవికాగ్ని మిత్రంలో యజ్ఞసేనుడు పంపిన లేఖకు అగ్నిమిత్రుడు ప్రతిలేఖను ఆజ్ఞాపించటాన్ని గమనించవచ్చు.

8. పథికుల రక్షణకు, వాళ్ళకు సహాయ పడటానికి ఆదేశిస్తూ దుర్గ పాలకులకు, రాష్ట్రాంత పాలకులకు, అధికారులకు రాసేది సర్వత్రగ లేఖ, దీనిని మార్గాలలోను దేశం అంతటా ప్రచారం చేయవలసిన శాసనంగా పరిగణిస్తారు. ఒక విధంగా చెప్పాలంటే శాసనాలు ఆకాలం నాటి ప్రసార మాధ్యమాలుగా వ్యవహరించాయి.

**లేఖన దోషాలు:** అకాన్తి, వ్యాఘాతం, పునరుక్తం, అపశబ్దం, సంప్లవం అనే ఈ ఐదు దోషాలను శాసన లేఖా దోషాలుగా పరిగణించారు.

1. కనిపించీ కనిపించకుండా అక్షరాలుండేవి అకాంతి
2. మొదట చెప్పిన దానికి తరువాత చెప్పినది విరుద్ధంగా ఉండటం వ్యాఘాతం. ఉదాహరణకు శ్రీవిరూపాక్ష, శ్రీరామ శాసనాలు.
3. చెప్పిందే మళ్ళీ చెప్పడం పునరుక్తం
4. లింగాలు, వచనాలు, కాలం, కారకాలు ప్రయోగించ వలసిన విధంగా కాక మరొక విధంగా ప్రయోగించటం అపశబ్దం
5. విరామం, అర్ధక్రమం విరుద్ధంగా ఉండటం సంప్లవం.

కౌటిల్యుడు చెప్పిన శాసన విధి క్రమం ఈ విధంగా ఉందని అంతకు పూర్వం ఈ విషయ ప్రస్తావన లేదని గమనించాలి.

అర్థక్రమం సంబంధం, పరిపూర్ణత, మాధుర్యం, ఔదార్యం, స్పష్టత్వం అనేవి శాసనాల కుండవలసిన ప్రధాన గుణాలని కౌటిల్యుడు తెలిపాడు. హేతుబద్ధత, సంక్షిప్తత కూడ ముఖ్యమైనవేనని మామిడిపూడి వెంకట రమణయ్య అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు .

ప్రభుత్వ పాలనం రాజకీయ సంస్థలు ప్రజా జీవిత విధానం అవి పనిచేసే తీరును గురించి చరిత్ర కారుల దృక్పథాన్ని విప్లవాత్మకంగా రూపొందించినది కౌటిల్యుని అర్థశాస్త్రం. అర్థశాస్త్రంలో వివరించినట్టుగానే పరాంతక చోళుని కాలంనాటి గ్రామీణ సంస్థలు ఏ విధంగా రూపుదిద్దుకున్నాయో అతడు వేయించిన ఉత్తర మల్లూరు శాసనంలో వివరంగా కనిపిస్తుంది.

**ఉపయుక్త గ్రంథసూచి:**బాలనందిని కౌటిలీయమ్ అర్థశాస్త్రం అధ్యక్షప్రచార: